సాక్షి
కామారెడ్డి

ఆదివారం । 27 । ఆగస్టు । 2023





వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను గెలిపించుకుంటామని మాచారెడ్డిలోని ఎల్లంపేటతో పాటు 8 గ్రామాల ప్రజలు తీర్మానించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హైదరాబాద్‌కు వెళ్లి ఎమ్మెల్సీ కవితను కలిశారు. మాచారెడ్డి ఎంపీపీ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

మాచారెడ్డి ఎంపీపీకి సీఎం ఫోన్

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి ఎమ్మెల్యేగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న నేపథ్యంలో మాచారెడ్డి మండలంలోని పది గ్రామాల ప్రజలు కేసీఆర్‌ కు మద్దతు ప్రకటించారు. దీనికి నాయకత్వం వహించిన ఎంపీపీ నర్సింగరావుకు శనివారం రాత్రి సీఎం కేసీఆర్ ఫోన్ చేసి అభినందించారు.

మాచారెడ్డిలో మరో మండలం?

మాచారెడ్డి(కామారెడ్డి) : మాచారెడ్డి మండలంలో మరో మండలం ఏర్పాటు కానున్నట్లు ఎంపీపీ లోయపల్లి నర్సింగరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఏకగ్రీవ తీర్మానాలతో హైదరాబాద్ వెళ్లిన ఆయనకు ఎల్లంపేటను మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తానని ఎమ్మెల్సీ కవిత హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఎల్లంపేట పరిధిలోని గిరిజన తండాలతో పాటు అన్నారం మండలం నుంచి కొన్ని గ్రామాలను కలుపుకొని నూతన మండలం ఏర్పాటు కోసం కృషి చేస్తానని కవిత హామీ ఇచ్చినట్లు నర్సింగరావు వివరించారు.

ఉచిత బియ్యం పంపిణీకి నేడు చివరి తేది

కామారెడ్డి రూరల్ : రేషన్ షాపుల ద్వారా అందజేస్తున్న ఆగస్టు నెలకు సంబంధించిన ఉచిత బియ్యం పంపిణీ ఈనెల 27 వరకు కొనసాగుతుందని రేషన్‌డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గొరిశెట్టి రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు రేషన్ బియ్యం తీసుకోని వారు ఉంటే వెంటనే తీసుకోవాలని కోరారు.

మదర్ హెల్త్ ప్రోగ్రాంను సక్సెస్ చేయాలి

రామారెడ్డి : మదర్ హెల్త్ ప్రోగ్రాంను వందశాతం సక్సెస్ చేయాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ వైద్యులను ఆదేశించారు. శనివారం రామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిని డీఎంహెచ్‌వో ఆయన తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. డెలివరీ అయిన పేషెంట్‌కు కేసీఆర్ కిట్‌ను అందించారు. చిన్నారులకు టీకాలను సరైన సమయంలో ఇప్పించాలన్నారు. మెడికల్ ఆఫీసర్ ఈట సురేష్, ఆయుష్ డాక్టర్ రమ్యశ్రీ, హెల్త్ ఎడ్యుకేటర్ భీం, శ్రీహరి, శ్రీధర్, ఫార్మసిస్ట్ స్వాతి, ప్రభాకర్ ఉన్నారు.

పోలీసుల పనితీరు భేష్

5 వర్టికల్స్‌లో ప్రథమ స్థానం



కామారెడ్డి క్రైం : పోలీసుశాఖలోని మొత్తం 14 వర్టికల్స్‌లో భాగంగా 5 వర్టికల్స్‌లో కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని రాష్ట్ర డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. శనివారం ఆయా జిల్లాల పోలీసు అధికారులతో వర్టికల్ విధానంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రిసెప్షన్, స్టేషన్ రైటర్, టెక్నికల్ టీం, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, సైబర్ క్రైం తదితర విభాగాల్లో కామారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉందన్నారు. వీసీలో కామారెడ్డి నుంచి ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు మదన్‌లాల్, ప్రకాష్, శ్రీనివాసులు, సీఐలు ఏఎస్సైలు పాల్గొన్నారు.

రాత్రంతా బావిలో చిక్కుకున్న మేకల కాపరి



బిచ్కుంద(జుక్కల్) : మేకపిల్లను రక్షించేందుకు వ్యవసాయ బావిలోకి దూకిన కాపరి రాత్రంతా బావిలోనే గడిపాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన దశరథ్ శుక్రవారం మేకల మందను కమ్మరి చెరువు ప్రాంతానికి తీసుకెళ్లాడు. అయితే మేత మేస్తున్న ఓ మేకపిల్ల పక్కనే ఉన్న బావిలో పడిపోవడంతో తల్లి మేక అరవగా గమనించిన దశరథ్ వెంటనే బావిలోకి దిగి మేకపిల్లను పైకి విసిరేశాడు. అప్పుడు సాయంత్రం 6 గంటలవుతోంది. ఎంత అరిచినా ఎవరూ పలకలేదు. చీకట్లో రాళ్లతో కట్టిన బావిలో పైకి రాలేక మోటార్ పైప్‌ను పట్టుకుని బావి గోడకు ఉన్న చిన్న రాయిపై రాత్రంతా గడిపాడు. మరోవైపు ఇంటికి వచ్చిన మేకల వెంట దశరథ్ రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామంలో వెతికినా జాడ దొరకలేదు. శనివారం ఉదయం 6 గంటలకు బావి పక్కనే ఓ రైతు వెళ్తున్న శబ్దం విన్న దశరథ్ రక్షించాలని కేకలు వేశాడు. దీంతో స్పందించిన రైతు బావిలో దశరథ్‌ను చూసి వెంటనే కుటుంబీలకు ఫోన్ చేయగా వారు వచ్చారు. చివరకు తాగు సాయంతో గ్రామస్తులు దశరథ్‌ను పైకి తీసుకొచ్చారు. భయంతో రాత్రంతా నిద్రలేదని, కూర్చునే ఉన్నానని కాపరి తెలిపారు.

మా ఊరు పేరు మాకు ఇష్టం!

ఒక్కోసారి ఊళ్ల గురించి మాట్లాడుతున్నపుడు ఊరి పేరును పలకడం చూసి ఇదెక్కడి ఊరు అనుకుంటారు. ఒక్కోసారి ఆ ప్రాంతానికి చెందిన వారు కూడా విస్తుపోతుంటారు. ఎందుకంటే ఊరు పేరొకటి ఉంటుంది. వాడుక భాషలో మరొకటి ఉంటుంది. మా ఊరి పేరు మాకు ఇష్టం.. అన్నట్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఊరి పేరు పలకడంలో తమకు అనుకూలమైన పేరునే చెప్పుకుంటారు.

– సాక్షి, కామారెడ్డి



తుజాల్‌పూర్ గ్రామం





- చాలా ఊళ్లలో వాడుక పేర్లకే ప్రాధాన్యం
- పేర్లలో పలకడంలో ఆత్మీయత
- కొత్త తరం కూడా అలాగే ఉచ్చారణ

సండే స్పెషల్



సదాశివనగర్‌లోని గడి

తాతల కాలం నుంచి వస్తున్న వాడుక పేర్లతోనే ఇప్పటికీ మాట్లాడుకోవడం కనిపిస్తుంది. కామారెడ్డి జిల్లాలో అట్లా చాలా గ్రామాలను పిలుచుకుంటారు. చాలా గ్రామాల్లో వాడుక పేర్లే ఎక్కువగా ప్రచారంలో ఉన్నాయి. చాలా మంది ఒరిజినల్ పేర్లకు బదులు వాడుక పేర్లనే చెబుతుంటారు. ఆయా గ్రామాల్లో చదువుకున్న వాళ్లు సైతం ఊళ్ల పేర్లను వాడుక పేర్లతోనే పలుకుతారు. ఆ ప్రాంతానికి కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు, ఉద్యోగులు, అధికారులు ఒక్కోసారి ఊరి పేరు విని అది ఎక్కడ అంటూ ప్రశ్నిస్తుండడం కనిపిస్తుంది.

మాది అనే భావన..

ఈ ఊరి పేరు చెప్పుకోవడంలో ఈ ఊరు మాది అన్నట్టుగా వారి మాటల్లో ఆత్మీయత కనిపిస్తుంది. పూర్వ కాలం నుంచి అక్కడి జనం ఊరి పేరును ఏరకంగా ఉచ్చరిస్తున్నరో ఇప్పటికీ అదే తోవలో నడుస్తుండడం గమనార్హం. ఆధునికత ఎంత చొచ్చుకువచ్చినా, ఎంత చదువుకున్నా ఊరి పేరు దగ్గరికి వచ్చేసరికి వాడుకలో ఉన్న పేర్లనే చెబుతుంటారు.

పేరులో నేముంది...

జిల్లాలో చాలా ఊళ్ల పేర్లను వాడుకలో వేరుగా పిలుస్తారు. కొందరికి ఊరి అసలు పేరు చెబితే కూడా అర్థం కాదు. బీబీపేట మండల కేంద్రాన్ని వాడుకలో 'బీపేట' అనే పిలుస్తారు. తరతరాలుగా ఆ ఊరి వాళ్లను మీ ఊరేది అంటే టక్కున 'బీపేట' అనే సమాధానం వస్తుంది. సదాశివనగర్ మండల కేంద్రాన్ని 'నగర్' అనే పిలుస్తారు. మాచారెడ్డి మండలం చుక్కాపూర్‌ను వాడుకలో 'సుక్కపురం' అని పిలుస్తారు. ఇదే మండలంలోని లక్ష్మీరావులపల్లిని లచ్చురాళ్లపల్లి అని అంటుంటారు. శెట్పల్లి సంగారెడ్డిని సంగడిపేట అంటారు. ఇసాయిపేటను ఇస్సపాట అని, అక్కాపూర్‌ను అక్కపురం అని, గన్‌పూర్‌ను గడ్డపురం అని, లచ్చాపేటను లచ్చుపేట అని పిలుస్తారు. ఇస్రోజీవాడిని ఇస్రజడ అని, కృష్ణాజీవాడిని కృష్ణజడ అని, తుక్కోజీవాడిని తుక్కజడ అని, కొండాపూర్‌ను కొండపురం, పద్మాజీవాడిని పద్మజడ, టేక్రియాల్‌ను టేకురాల, దేవాయిపల్లిని దేవపల్లి, కన్‌కల్‌ను కన్కంటి, నందివాడను నంద్యాడ, ఎర్రాపహాడ్‌ను ఎర్రవాటి, సంగోజివాడిని సంగజడ, కాలోజీవాడీని కాల్‌జడ అని, సంగమేశ్వర్‌ను సంగనాతిపల్లి అంటుంటారు.

కాచాపూర్‌ను కాసపురం అని, బస్వాపూర్‌ను బసపురం అంటారు. వాడిని వాడె అని, ఫరీదుపేటను ఫర్దిపేట, అంబారీపేటను అంబర్పేట, మాందాపూర్‌ను మందపురం, పల్వంచను పలంచ, రాజఖాన్‌పేటను రయికాన్‌పేట, భవానీపేటను బాన్‌పేట, సోమారిపేటను సోమారి,

కాచాపూర్.. కాసపురం..

బండరామేశ్వర్‌పల్లిని బండ్రాసిపల్లె, ఉగ్రవాయిని ఉగ్రాయి. ఇట్లా ఊరు పేరును వాడుకలో వేరుగా పిలుస్తుంటారు. ఎల్లారెడ్డి పట్టణాన్ని తాలూక ఎల్లారెడ్డి అనే పలుకుతారు. మర్కల్‌ను మర్కంటి అని, ఉప్పల్‌వాయిని ఉప్లాయ అని పిలుస్తారు.



ఎల్లారెడ్డిలోని తహసీల్దార్ కార్యాలయం



సేరి బీబీపేట గ్రామ పంచాయితీ భవనం

సుక్కపురం అనే పిలుస్తరు..



మా ఊరి పేరు చుక్కాపూర్. కానీ అందరూ సుక్కపురం అంటుంటరు. మాకు ఊహ తెలిసినప్పటి నుంచి సుక్కపురం అంటేనే అందరికీ తెలుస్తది. రాతలో మాత్రం ఊరి పేరు చుక్కాపూర్ అని రా స్తుంటాం. ముసలోళ్లు అందరూ సుక్కపురమనే అంటరు.

– భూంరెడ్డి, చుక్కాపూర్

పేరులో ప్రేమ కనిపిస్తుంది



మా ఊరి పేరును అందరూ బీపేట అనే అంటరు. బీబీపేట అని కొద్దిమంది మాత్రమే మాట్లాడుతరు. పేరులో ఎంతో ప్రేమ కనబడుతది. మీదేవురంటే బీపేట అని టక్కున చెబుతం. తరతరాలుగా మా ఊరి పేరును బీపేట అనే పిలుస్తున్నరు.

– దేవరాజు, బీబీపేట

మేమైతే బీపేటనే అంటం



మా ఊరి పేరు బీబీపేట అయినా బీపేట అని పిలుసుడే అలవాటైంది. నాకు చిన్నప్పటి నుంచి బీపేట అనే తెలుసు. ఓళ్లు అడిగినా బీపేట అని అంట. చానా మంది బీపేట అనే మాట్లాడుతరు. బీబీపేట అని కొద్ది మంది మాత్రమే మాట్లాడుతరు.

– రాములు, బీబీపేట

దగాకోరు 'ధరణి'ని రద్దు చేస్తాం



మాట్లాడుతున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

భిక్కనూరు : నిజమైన రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న దగాకోరు ధరణి పోర్టల్‌ను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రద్దుచేస్తామని ఆ పార్టీ రాష్ట్రవ్యవహారాల కమిటీ చైర్మన్, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ అన్నారు. శనివారం ఆయన భిక్కనూరు మండలం జంగంపల్లి గ్రామానికి చెందిన వొడ్డెర కులస్తులు కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ సీఎం కేసీఆర్ హయాంలో కొన్ని వర్గాల ప్రజలు దోపిడీకి గురవుతున్నారన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన అన్ని హామీల ప్రకారం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ. 500 గ్యాస్ సిలిండర్, ఒకే దఫాలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిస్వార్థమైన కార్యకర్తల అండ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, కాంగ్రెస్ ఐటీ సెల్ జిల్లా కన్వీనర్ చిట్టెడి సుధాకర్‌రెడ్డి, జంగంపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు మూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీదే అధికారం



మాట్లాడుతున్న అక్కల్‌కోట్ ఎమ్మెల్యే కల్యాణ్ శెట్టి

- అక్కల్ కోట్ బీజేపీ ఎమ్మెల్యే కల్యాణ్ శెట్టి
- కేసీఆర్‌కు ఓటమి తప్పదు: వెంకటరమణారెడ్డి, మైపాల్‌రెడ్డి
- జిల్లా కేంద్రంలో బైక్‌లతో భారీ ర్యాలీ

కామారెడ్డి టౌన్ : ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంతో తెలంగాణలో బీజేపీకి ప్రజలు పట్టం కట్టి అధికారంలోకి తీసుకొస్తారని, ఇక్కడి పరిస్థితులు చూస్తే తెలిసిపోతుందని మహారాష్ట్రలోని అక్కల్ కోట్ ఎమ్మెల్యే కల్యాణ్‌శెట్టి అన్నారు. ఎమ్మెల్యే ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ విధానాల వల్ల ప్రజలు విసిగిపోయారని, బీజేపీ అధికారంలోకి రావడం ఖయమన్నారు. కేసీఆర్‌కు కామారెడ్డిలో ఓటమి తప్పదని, ఇక్కడి నుంచి పారిపోయేలా చేస్తామని బీజేపీ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి బద్దం మైపాల్‌రెడ్డి విమర్శించారు. ఓట్లకోసం రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసి ప్రభుత్వ ఆస్తులను అమ్ముకున్న ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. యువతను మద్యానికి బానిస చేస్తున్నారన్నారు. కామారెడ్డిలో బీజేపీకి లక్ష మెజార్టీ ఖాయమన్నారు. సీఎం కేసీఆర్‌పై తన పోరాటం ఆగదని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. ఇక్కడి పోటీ నుంచి తప్పుకోకుండా పారిపోకుండా చూడండంటూ ఎద్దేవా చేశారు. జిల్లా కేంద్రంలో 3,856 బైక్‌లతో భారీ ర్యాలీ నిర్వహించారు. రాజారెడ్డి గార్డెన్ నుంచి పుర వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మారెడ్డి, తేలు శ్రీనివాస్, విపుల్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నాన్న గెలుపు కోసం..

- రంగంలోకి దిగిన కవిత
- రేపు భిక్కనూరులో ర్యాలీ, సమావేశం
- ఎన్నికల నగారా మోగించనున్న ఎమ్మెల్సీ



సాక్షి, కామారెడ్డి : ఎన్నికల షెడ్యూల్ వెలుబడకముందే కామారెడ్డి జిల్లా రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ముఖ్యంగా కామారెడ్డి నియోజకవర్గంలో ప్రధాన పార్టీలు ఎన్నికల కోసం సర్వం సిద్ధమై నిత్యం ఏదో ఒక కార్యక్రమం పేరుతో జనం మధ్యన తిరుగుతున్నారు. కాగా రాష్ట్రవ్యాప్తంగా అధికార బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థులను ప్రకటించింది. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిత్వాల కోసం దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తుల పరిశీలన, అభ్యర్థుల బలాబలాలు, సర్వేల ఆధారంగా అభ్యర్థుల ఎంపికై దృష్టి సారించనుంది. బీజేపీ కూడా అభ్యర్థిత్వాల కోసం కసరత్తు చేస్తోంది. ఈసారి కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా సీఎం కేసీఆర్ పోటీ చేస్తారన్న ప్రకటనతో ఉమ్మడి జిల్లాలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ఇదిలా ఉండగా కొంత కాలంగా కామారెడ్డి రాజకీయాలకు దూరంగా ఉంటూ వచ్చిన ఎమ్మెల్సీ కవిత కామారెడ్డి నుంచి సీఎం కేసీఆర్ పోటీ చేస్తుండడంతో కామారెడ్డి మీద దృష్టి పెట్టారు. అందులో భాగంగా ఈనెల 28న జిల్లాకు ముఖద్వారమైన భిక్కనూరు మండలం నుంచి ఎన్నికల నగారా మోగించనున్నారు. 44వ నంబరు జాతీయ రహదారిపై భిక్కనూరు మండలం బస్వాపూర్ నుంచి ప్రారంభమయ్యే బైక్ ర్యాలీలో కవిత పాల్గొంటారు. బస్వాపూర్ నుంచి భిక్కనూరు సిద్ధరామేశ్వర స్వామి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహిస్తారు. అనంతరం మండల కేంద్రంలో కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. సిట్టింగ్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో కవిత పాల్గొని దిశానిర్దేశం చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్నందున అప్పట్లో ఉద్యమానికి అండగా నిలిచిన పల్లెల్లో ఏకగ్రీవ తీర్మాణాలు చేసేలా కార్యచరణ రూపొందిస్తున్నారు. అందులో భాగంగా కామారెడ్డి మండలం గర్గుల్, మాచారెడ్డి మండలంలోని తొమ్మిది గిరిజన పంచాయతీల్లో కేసీఆర్‌కు మద్దతుగా తీర్మానించారు. 9 జీపీల ప్రజలతో కలిసి ఎంపీపీ నర్సింగరావ్ ఆధ్వర్యంలో ఎల్లంపేట గ్రామంలో భారీర్యాలీ నిర్వహించారు.

శ్రేణుల్లో జోష్ నింపేలా..

అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ వెలుబడకముందే క్యాడర్‌లో జోష్ నింపేందుకు బీఆర్ఎస్ నాయకత్వం ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగానే భిక్కనూరులో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యకర్తల నుంచి ఫీడ్‌బ్యాక్, అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్ అంశాలపై చర్చించే అవకాశముంది. ఎన్నికలకు ఇంకా సమయమున్నప్పటికీ ఇప్పటి నుంచే కార్యకర్తల్లో జోష్ నింపే ప్రయత్నం జరుగుతోంది.

భిక్కనూరుతో మొదలు..

బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఎమ్మెల్సీ కవిత భిక్కనూరు సభతో నగారా మోగించనున్నారు. భిక్కనూరు సభలో ఎన్నికల ప్రచారం మొదలవుతుందని భావిస్తున్నారు. కాగా కామారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రంగంలో నిలవనున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ ఇప్పటికే ఊరూరు తిరుగుతున్నారు. ఎన్నికల ప్రచారాన్ని జోరుగా సాగిస్తున్నారు. ఇదే సమయంలో బీజేపీ నుంచి పోటీ చేయనున్న జెడ్పీ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి పార్టీ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నారు. సొంత డబ్బులతో కుల సంఘాలు, దేవాలయాలకు నిధులిస్తూ వాటికి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారు. అధికార పార్టీ భిక్కనూరు సభతో ఎన్నికల నగారా మోగిస్తుండడంతో రాజకీయం మరింత వేడెక్కుతుందని భావిస్తున్నారు.

మొక్కలు నాటితేనే మనుగడ

- కోటి వృక్షార్చన కార్యక్రమంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



మొక్కకు నీళ్లు పోస్తున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ : ప్రకృతి దేవుడిచ్చిన వరమని, ప్రకృతిని కాపాడితే అది మనల్ని కాపాడుతుందని, మొక్కలు నాటితేనే మానవాళికి మనుగడ అని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కోటి వృక్షార్చన కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ తెలంగాణలో పచ్చదనం పెంచడానికి రాష్ట్ర ప్రభుత్వం 2016లో తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు. 230 కోట్ల మొక్కలు నాటడం లక్ష్యమైతే దానిని అధిగమించి ఇప్పటివరకు 270 కోట్ల మొక్కలు నాటామన్నారు. ఒకేరోజు కోటి మొక్కలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా కోటి వృక్షార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చెట్లను నరికి, ప్రకృతిని నాశనం చేస్తే విలయాలు సంభవిస్తాయన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడినప్పుడు అడవుల విస్తీర్ణం 26 శాతం ఉండగా, రాష్ట్రం ఏర్పడ్డాక ప్రభుత్వ కృషితో 33 శాతానికి పెరిగిందన్నారు. ఆర్డీవో భుజంగరావు, మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, జిల్లా రైతు సమన్వయ సమతి అధ్యక్షుడు అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ నర్సింలు, జుబేర్, శ్రీనివాస్, వాహబ్, ఎజాస్, కృష్ణారెడ్డి, లింగం,రాజు,నర్సగొండ, రఫీ ఉన్నారు.

క్లుప్తంగా

దళితబంధు కోసం జీపీ కార్యాలయం ముట్టడి



మాచారెడ్డి: పాల్వంచ మండలం ఫరీదుపేటలో దళిత బంధు కోసం గ్రామ దళితులు శనివారం పంచాయతీ కార్యాలయం ముట్టడించి గంటపాటు ఆందోళన చేశారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బట్టెంకి బాల్ రాజు మాట్లాడుతూ.. దళితబంధును బీఆర్ఎస్ నాయకులకు నచ్చిన వారికే ఇచ్చారని ఆరోపించారు. దళితుల్లో నిరుపేదలకు ఆ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. తమ్మడి స్వామి, బట్ట రాజు, లక్ష్మీనారాయణ, రాజశేఖర్, శ్రీకాంత్, బాబు, తిరుమలయ్య ఉన్నారు.

ఎన్నికల కోసం పోలింగ్ స్టేషన్లు సిద్ధం



నిజాంసాగర్(జుక్కల్) : అసెంబ్లీ ఎన్నికలకు బూత్‌ల వారిగా పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేయాలని అదనపు కలెక్టర్ మనుచౌదరి అధికారులను ఆదేశించారు. శనివారం మండలంలోని మహమ్మద్‌నగర్, బూర్గుల్ గ్రామా ల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారిగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పించాలన్నారు. విద్యుత్ సదుపాయంతో పాటు తాగునీటి సదుపాయం, పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్, గదులను సిద్ధం చేయాలన్నారు. కొత్తగా ఓటుహక్కు నమోదుతో పాటు పోలింగ్ కేంద్రాల వారిగా ఉన్న ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట స్థానిక తహసీల్దార్ భిక్షపతి, గిర్దావర్ బాను తదితరులు ఉన్నారు.

అధ్వానంగా కోర్టు రోడ్డు



కామారెడ్డి రూరల్: కామారెడ్డి కోర్టుకు వెళ్లే మార్గంలో రోడ్డుపై మురుగు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వివేకానంద కాలనీలో మురికి నీరు రోడ్డుపై చేరి దుర్గంధం వ్యాపిస్తుంది. కోర్టు, జిల్లా పరిషత్ కార్యాలయం, తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయానికి ఇదే మార్గంలో వెళ్తుంటారు. మున్సిపల్ అధికారులు పట్టించుకుని రోడ్డుపై మురుగు నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీపీ రికార్డుల పరిశీలన



పిట్లం: మండలంలోని రాంపూర్‌లో శనివారం బాన్సువాడ డీఎల్‌పీవో శ్రీనివాస్ పంచాయతీ రికార్డులు పరిశీలించారు. అనంతరం పోలింగ్ కేంద్రాన్ని, ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పంచాయతీ పరిధిలలో నాటిన మొక్కలను సంరక్షించాలని సిబ్బందికి సూచించారు. ఎంపీవో బ్రహ్మం పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్



గాంధారిలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పాటిల్

కామారెడ్డి క్రైం: పారదర్శకంగా ఓటరు జాబితా రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. వీసీ అనంతరం కలెక్టర్ పాటిల్ జిల్లా అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. జిల్లాలోని పోలింగ్ కేంద్రాల జాబితా వివరాలను ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని సరి చేసుకోవాలన్నారు. జాబితా నుంచి పేరు తొలగించే సమయంలో ఎన్నికల కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తూ.చ తప్పకుండా పాటించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని బూత్ స్థాయి అధికారుల జాబితా వివరాలు రాజకీయ పార్టీలకు అందించాలని, బూత్ స్థాయి ఏజెంట్ల వివరాలు సమర్పించాల్సిందిగా రాజకీయ పార్టీలకు సూచించాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో నూతనంగా మంజూరు చేసిన ఓటర్లకు ఓటర్ గుర్తింపు కార్డులు ముద్రించి అందించాలన్నారు. అదనపు కలెక్టర్లు మను చౌదరి, చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

కామారెడ్డి క్రైం: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని, అక్టోబర్ 1, 2023 నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శనివారం కామారెడ్డిలోని మార్కెట్ కమిటీ, గంజ్ ఉన్నత పాఠశాలల్లోని పోలింగ్ బూత్‌లను శనివారం సందర్శించారు. ఓటరు ముసాయిదా ప్రతులను, నమోదు పత్రాలను పరిశీలించారు. కామారెడ్డి తహసీల్దార్ లత, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ సాయిలు ఉన్నారు.

గాంధారి: 18 ఏళ్లు నిండిన వారందరు ఓటరు జాబితాలో పేర్లు నమోదు చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శనివారం గాంధారి ఉన్నత పాఠశాల ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాస్ నేరల్, నేరల్ తండా, నాగ్లూర్, చద్మల్, చద్మల్ తండాలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. తహసీల్దార్ జానకీ ఉన్నారు.

అన్నారం తండాలో వైద్యశిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సాక్షి ఎఫెక్ట్..



గ్రామాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

రాజంపేట: మండలంలోని అన్నారం తండాలో శనివారం ఎర్రపహాడ్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శనివారం 'మంచం పట్టిన తండా' శీర్షికతో సాక్షి పత్రికలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శిబిరం ఏర్పాటు చేసి విష జ్వరాలకు గురైన 135 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో సుమారు 100 మందికి పైగా డెంగ్యూ, వైరల్ ఫీవర్ ఉన్నట్లు గుర్తించినట్లు మెడికల్ ఆఫీసర్ రాజశేఖర్ తెలిపారు. దీని ప్రభావంతో పలువురికి రక్త కణాలు తగ్గి నీరసంగా మారారన్నారు. వీరికి మందులు అందజేసి, పరిస్థితి విషమంగా ఉన్న నలుగురిని కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, మెడికల్ ఆఫీసర్ అంజూమనజీర్ ఇంటింటికి వెళ్లి పరిసరాలను పరిశీలించారు. తండాలో నీరు నిల్వ లేకుండా చూడాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. వైద్యులు నారాయణ, వినయ్, కమల, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీఓ రఘురాం, సర్పంచ్ స్రవంతి, ఉప సర్పంచ్ రవి, ఎంపీటీసీ సాగర్ పాల్గొన్నారు.

ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలి



మాట్లాడుతున్న అస్సాం ఎమ్మెల్యే అజయ్‌కుమార్

నిజాంసాగర్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓట్లు వేసి బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని అస్సాం ఎమ్మెల్యే అజయ్‌కుమార్ అన్నారు. శనివారం జుక్కల్ మండలం మహమ్మదాబాద్ గ్రామంలో ప్రవాస్‌యోజన కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయం దగ్గర పడుతుండటంతో బూత్‌ల వారీగా ఓటర్లను చైతన్యం చేయాలన్నారు. బీజేపీ గెలుపు కోసం కష్టపడి పని చేసిన వారికి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణాతార, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను ప్రచారం చేయాలి

ఎల్లారెడ్డి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి ప్రచారం చేయాలని కర్ణాటక బీజేపీ ఎమ్మెల్యే బీపీ హరీష్ అన్నారు. శనివారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన బీజేపీ నాయకుల పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికలలో బీజేపీ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

విదేశాల్లో ఉన్నత విద్యకు స్కాలర్‌షిప్‌లు

కామారెడ్డి క్రైం: విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే పేద మైనారిటీ విద్యార్థులకు సీఎం ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకం కింద ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను, పార్శీ, బౌద్ధ మతానికి చెందిన పేదలకు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ స్కాలర్షిప్ అందజేయనుందని కలెక్టర్ తెలిపారు. 2023 స్ప్రింగ్ సీజన్‌లో విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడ్యుయేట్, డాక్టరేట్ కోర్సులు చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబర్ 21 సాయంత్రం 5 గంటల్లోగా కలెక్టరేట్ సముదాయం, 2వ అంతస్తులో గల మైనారిటీ సంక్షేమాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8096973346 నంబరును సంప్రదించాలని సూచించారు.

మైనారిటీల జీవితాల్లో వెలుగులు

- హోంశాఖ మంత్రి మహమూద్ అలీ



మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న హోం మంత్రి మహమూద్ అలీ, స్పీకర్ పోచారం

రుద్రూర్/ వర్ని: మైనారిటీల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వెలుగులు నింపుతోందని హోంశాఖ మంత్రి మహమూద్ మహమూద్ అలీ అన్నారు. కోటగిరిలో రూ.6కోట్ల 70లక్షలతో నిర్మించిన మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ భవనాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభించారు. మైనారిటీల పిల్లలు విద్యకు దూరమవుతున్నారని గుర్తించిన సీఎం కేసీఆర్ రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడక ముందు రెసిడెన్షియల్ స్కూళ్లు ఏడు ఉండగా కొత్తగా 204 పాఠశాలలను ప్రారంభించినట్లు తెలిపారు. దీంతో మైనారిటీల్లో చదువుకునే బాలికల శాతం పెరిగిందన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో ప్రతిభ చూపుతున్నారన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో వందశాతం పథకాలు అమలవుతున్నాయని అన్నారు. వచ్చే ఎన్నికల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ వెయ్యి16 రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేసినట్లు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సర్వమత పాలన కొనసాగుతోందని అన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల పంపిణీలో కూడా మైనారిటీలకు 25 శాతం ప్రాధాన్యత ఇస్తున్నట్లు వెల్లడించారు. మండల కేంద్రంలో భారీ గజమాలతో హోంమంత్రి, స్పీకర్లను నాయకులు సన్మానించారు. అనంతరం మైనారిటీ యువకులకు రూ. లక్ష ఆర్థిక చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మైనారిటీ కమిషన్ చైర్మన్ తారీఖ్ అన్సారీ, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఇంతియాజ్, ఉర్దూ అకాడమీ చైర్మన్ ముజీబుద్దీన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మసీఉల్లా ఖాన్, జెడ్పీ చైర్మన్లు దాదన్నగారి విఠల్ రావు, దఫేదార్ శోభారాజు, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఆర్డీవో రాజా గౌడ్, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్ సెక్రటరీ షఫీఉల్లా పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోనే లక్ష్యసాధన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, ఓయూ వీసీ రవీందర్‌యాదవ్

- పేడెడ్ కలర్స్ పుస్తకాన్ని ఆవిష్కరించిన ఉన్నత విద్యామండలి చైర్మన్

తెయూ(డిచ్‌పల్లి): ఉన్నత విద్యతోనే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తామని ఇందుకు నిదర్శనమే టీయూ తెలుగు అధ్యయన శాఖ అధ్యాపకుడు, ఆర్ట్స్ డీన్ ప్రొఫెసర్ కనకయ్య అని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ రిక్క లింబాద్రి అన్నారు. ప్రొఫెసర్ కనకయ్య రాసిన 'నెరిసిన జీవితాలు' పుస్తకాన్ని రచయిత డాక్టర్‌వెంకటరెడ్డి ఇంగ్లిష్‌లోకి అనువదించిన 'పేడెడ్ కలర్స్' పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ రవీందర్‌యాదవ్ శనివారం ఆవిష్కరించారు. కనీసం పెన్సిల్, స్కేల్ కొనుక్కోలేని పేదజీవితాలను కళ్లకు కట్టినట్టు ఆవిష్కరించి పుస్తక రూపంలో తీసుకురావడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్రొఫెసర్ కనకయ్యను ఘనంగా సన్మానించారు. నసుమాస స్వామి, పుప్పాలరవి, శ్రీనివాస్, చిలుక భాస్కర్, పసునూరి రవీందర్, ఆచార్యులు నథానియేలు, జీవీరత్నాకర్, పల్లెలు వీరస్వామి, సుధాకర్, ఎడ్ల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-2లో శిక్షణ

కామారెడ్డి క్రైం : గ్రూప్–2 పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో 45 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముస్లింలు, క్రైస్తవులు, సిక్కులు, జైనులు, బుద్ధిస్టులు, పార్శీలు కామారెడ్డి పట్టణంలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 30లోగా తమ విద్యార్హతలతో పాటు కుల ధ్రువీకరణ పత్రాన్ని జతపర్చి సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని 2వ అంతస్తులో ఉన్న జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమాధికారి కార్యాలయం, రూం నం. 222లో దరఖాస్తు సమర్పించాలన్నారు. వివరాలకు 73062 42629లో సంప్రదించాలన్నారు.

టేకేదార్లకు జీవన భృతి

డొంకేశ్వర్(ఆర్మూర్): కార్ఖానాలు నిర్వహించే టేకేదార్లకు రాష్ట్ర ప్రభుత్వం జీవన భృతి అందజేస్తోంది. జిల్లాలో 614 మందికి పింఛన్లు ఇటీవల మంజూరయ్యాయి. వీరికి నెలకు రూ.2,016 ఇవ్వనుండగా, ఈ నెల నుంచే చేతికి రానున్నాయి. పోస్టాఫీసుల ద్వారా ఈ పింఛన్లను పంపిణీ చేయనున్నారు. లబ్ధిదారుల వివరాలను గ్రామీణాభివృద్ధి ఇప్పటికే అన్ని మండలాల ఎంపీడీవో కార్యాలయాలకు పంపింది. జిల్లాలో మొత్తం పింఛన్ల సంఖ్య 2,78,015కు చేరింది.

పెరిగిన పింఛన్ అందుకున్న దివ్యాంగులు..

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే దివ్యాంగులకు పెరిగిన పింఛన్ డబ్బులు అందాయి. రూ.3,016 ఉన్న పింఛన్‌ను రూ.4,016కు ప్రభుత్వం పెంచింది. జిల్లాలోని 19,446 మంది దివ్యాంగులు పెరిగిన రూ.4,016 పింఛన్‌ను ఈ నెలలో అందుకుని సంతోషం వ్యక్తం చేశారు.

మొక్కలు నాటడం అందరి బాధ్యత



దోమకొండ: మొక్కలు నాటడం అందరి బాధ్యత అని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఆయన మొక్కలను నాటారు. అనంతరం పల్లెప్రకృతి వనం పరిశీలించారు. అనంతరం దోమకొండతో పాటు లింగుపల్లి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎంపీపీ కానుగంటి శారద, సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య, సర్పంచ్ నల్లవు అంజలి, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, కుంచాల శేఖర్, ఎంపీడీవో చిన్నారెడ్డి, తహసీల్దార్ సంజయ్‌రావు ఉన్నారు.

మొటాట్‌పల్లిలో శిలాఫలకం ధ్వంసం



భిక్కనూరు: మొటాట్‌పల్లి గ్రామంలో అభివృద్ధి పనులకు సంబంధించి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు శనివారం వేకువజామున ధ్వంసం చేశారు. ఇటీవల గ్రామంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను సైతం చించివేశారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ మొటాటి రాజేశ్వరీరాజిరెడ్డి తెలిపారు.

ఇద్దరు నిందితుల రిమాండ్

కామారెడ్డి క్రైం: పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవునిపల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా గౌతమ్‌నగర్‌కు చెందిన అయూబ్‌ఖాన్, హైదరాబాద్ రాజేంద్రనగర్‌కు చెందిన మహమ్మద్ అమీర్ గత నెల 2న దేవునిపల్లి పరిధిలోని ఎస్సార్ వైన్స్ ముందు ఉన్న బైక్‌ను, వైన్స్ రేకులను ధ్వంసం చేసి రూ. మూడు వేల నగదును దొంగిలించారు. శనివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా నిజామాబాద్ నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న వీరు పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించారు. వీరిని పట్టుకున్న పోలీసులు విచారణలో తామే బైక్, వైన్స్ దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడించారు. గతంలో అయూబ్ పై 5, అమీర్‌పై 13 దొంగతనం కేసులు ఉండగా జైలుకు వెళ్లి వచ్చినట్లు తెలిపారు. వీరు నిజామాబాద్‌లోని తాళం వేసి పలు ఇండ్లల్లో చోరీకి పాల్పడినట్లు చెప్పారు. నాలుగు కేసులకు సంబంధించి నిందితుల నుంచి పల్సర్ బైకు, రూ. ఏడు లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

బీబీసీ పాఠశాలకు నోటీసులు

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని బీబీసీ ప్రైవేట్ పాఠశాలకు డీఈవో దుర్గాప్రసాద్ శనివారం నోటీసులు జారీ చేశారు. పాఠశాలకు చెందిన 7వ తరగతి విద్యార్థినిని బయటకు తీసుకెళ్లిన ఘటనపై తల్లిదండ్రులు డీఈవోకు ఫిర్యాదు చేశారు. దీంతో దారుగల్లీ పాఠశాల హెచ్‌ఎం శంకర్‌ను డీఈవో విచారణ అధికారిగా నియమించారు. అంతకు ముందే 5వ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బీబీసీ పాఠశాల చైర్మన్ ప్రవీణ్‌పై కేసు నమోదైంది. విచారణ చేపట్టిన శంకర్ నివేదికను డీఈవోకు అందజేశారు. అనంతరం విచారణ మేరకు పాఠశాల గుర్తింపును రద్దు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ నాయకుల బాహాబాహీ

ఎల్లారెడ్డి: బీజేపీ నాయకులు బాహాబాహీకి దిగిన ఘటన ఎల్లారెడ్డి పట్టణంలో శనివారం చోటు చేసుకుంది. పట్టణంలోని బాలాగౌడ్ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ నాయకుల ప్రవాస్ యోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముందు వేదికపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పైల కృష్ణారెడ్డి ఫొటో లేక పోవడంతో బీజేపీ నాయకులు బైండ్ల పోచయ్యతో గొడవ పడినట్లు సమాచారం. దీంతో ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. చివరికి వేదికపై ఫ్లెక్సీ లేకుండానే సమావేశాన్ని నిర్వహించారు. ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడిన ఘటనలో కృష్ణారెడ్డి చేతి వేలికి గాయమైనట్లు సమాచారం.

వృద్ధుడి ఆత్మహత్య

రాజంపేట: చెరువులో దూకి వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్సై గంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సత్తయ్య(75) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నాలుగు రోజుల క్రితం కామారెడ్డికి వెళ్తున్నట్లు చెప్పిన సత్తయ్య ఇంటికి తిరిగిరాలేదు. శనివారం స్థానిక చెరువులో మృతదేహం లభ్యం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సత్తయ్య మృతదేహంగా గుర్తించారు. సత్తయ్య కుమారుడు రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

గుడిసె దగ్ధం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): దావల్‌మల్కపల్లి గ్రామంలో పిట్ల సంగవ్వకు చెందిన నివాసపు గుడిసె విద్యుదాఘాతంతో దగ్ధమైనట్లు గ్రామస్తులు శనివారం తెలిపారు. గుడిసెలో అకస్మాతుగా మంటలు చెలరేగడంతో సంగవ్వ బయటకు వచ్చింది. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

క్రైం కార్నర్

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి



మంజుల మృతదేహం

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని గున్కుల్ గ్రామానికి చెందిన మొట్ట మంజుల(40) శనివారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఎస్సై రాజేశ్వర్, బాన్సువాడ రూరల్ సీఐ మురళీ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మంజుల హార్ట్‌స్ట్రోక్‌తో మృతి చెందిందని సీఐ తెలిపారు. ఇదిలా ఉండగా మంజుల ఇంటి తలుపులు తెరిచి ఉండడం, చుట్టు పక్కల బీపీ మాత్రలు ఉండడంతో గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేస్తామని ఏఎస్సై తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..



పృథ్వీరాజ్ (ఫైల్)

మాక్లూర్: గొట్టిముక్కల గ్రామానికి చెందిన పృథ్వీరాజ్ (24) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి తన మిత్రులతో కలిసి వెళ్లిన పృథ్వీరాజ్ 12వందల మెట్టు వద్ద స్పృహతప్పి పడిపోయాడు. ఆస్పత్రికి తరలించే లోపే మృతి చెందినట్లు పేర్కొన్నారు. పృథ్వీరాజ్‌కు మరో 15 రోజుల్లో వివాహం జరగాల్సి ఉండగా మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుర్తు తెలియని వృద్ధుడు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు శనివారం తెలిపారు. రైల్వేస్టేషన్‌తోపాటు పరిసరాల ప్రాంతంలో భిక్షాటన చేసేవాడని పేర్కొన్నారు. ఫొటో ఆధారంగా ఎవరైనా గుర్తిస్తే వివరాలు అందించాలని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కాలోజివాడిలో డీజే చోరీ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కాలోజివాడి గ్రామంలో డీజే చోరీకి గురైనట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఈ నెల 24న గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన విందు కార్యక్రమానికి ముస్కు రవికుమార్‌కు సంబంధించిన డీజేను ఏర్పాటు చేశారు. 25న డీజే, సామగ్రి లేకపోవడంతో బాధితుడు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

తాళం వేసిన ఇళ్లలో

బాల్కొండ: మండలంలోని వన్నెల్(బి) గ్రామంలో తాళం వేసిన ఇండ్లు, కిరా దుకాణంలో శుక్రవారం రాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై గోపి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన రాజవ్వ, వడ్డెర గంగన్న, దేవారెడ్డికి చెందిన ఇండ్లు, కిరాణ దుకాణంలో గుర్తు తెలియని దుండగులు తాళాలు పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. రెండు ఇండ్లల్లో ఆరు తులాల బంగారం, ఏడు తులాల వెండి, రూ. 29 వేల నగుదు, కిరాణం షాపులో కొంత నగదు, సామగ్రి చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరాకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఎడపల్లి(బోధన్): జానకంపేట సమీపంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కుర్నాపల్లి గ్రామానికి చెందిన జంగం రాజు తన బైకుపై ఆలయ రహదారి సమీపంలో బైక్‌పై ప్రయాణిస్తున్న దంపతులను ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ రాజు చికిత్స పొందుతూ మృతి చెందగా మహిళకు తీవ్రంగా గాయాలయ్యాయి.

చికిత్స పొందుతూ ఒకరు..



రాజన్న మృతదేహం

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండలంలోని అర్గుల్ గ్రామ శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లూరి రాజన్న (48) మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. అర్గుల్‌కు చెందిన రాజన్న వ్యవసాయ పనుల నిమిత్తం బైక్‌పై పొలానికి వెళ్లి వస్తుండగా జాతీయ రహదారిపై మరో బైక్ రాజన్నను ఢీకొన్నది. ఈ ఘటనలో రాజన్న తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాజన్న మృతి చెందాడు. మృతుడికి భార్య సత్తెమ్మ, కుమారుడు భాస్కర్ ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.